క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



శ్రీలేఖను అభినందిస్తున్న కరస్పాండెంట్

కరీంనగర్‌స్పోర్ట్స్: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 14న జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని శ్రీలేఖ ప్రతిభ కనబర్చింది. 18 ఏళ్ల బాలికల విభాగంలో మూడు కిలోమీటర్ల పరుగుపందెంలో రెండోస్థానం, 400, 100 మీటర్ల పరుగుపందెలో మూడోస్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఉట్కూరి మహిపాల్‌రెడ్డితో పాటు మేడ వెంకటవరప్రసాద్, కాంతల రాంరెడ్డి, సింహచలం హరికృష్ణ, వంగల సంతోశ్‌రెడ్డి, లెంకల మహిపాల్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణలు అభినందించారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు


బ్రెడ్ ప్యాకెట్లు అందిస్తున్న ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్-కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం బొమ్మకల్‌కు చెందిన రాయమల్లు, రాజమ్మలకు లయన్స్ రేకుర్తి కంటి ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్ సహకారంతో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. రోగులకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు చింతల కిషన్, ప్రభాకర్‌లు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు అందించారు.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు 'అపార్'

కరీంనగర్‌కల్చరల్: దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో అధికారిక ఎంట్రీగా 'అపార్' లఘు చిత్రం ఎంపికయ్యింది. ఈ చిత్రానికి కరీంనగర్‌కు చెందిన అన్వేశ్ వారాల డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ. అన్వేశ్ మొదట కేరళలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఏవియానిక్స్ చదివాడు. ఇస్రోలో ఉద్యోగాన్ని కాదనుకుని తనకున్న ఆసక్తి మేరకు సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్‌లో పీజీ కోర్సు ఇన్ సినిమాటోగ్రఫీ చదివాడు. 15 నిమిషాల నిడివిగల ×అపార్ షార్ట్ ఫిలిం లెస్బియన్ సమస్య మీద రూపొందించబడింది. ఈ చిత్రంలో రాజా చక్రవర్తి, అర్పితా డే తదితరులు నటించగా అభిసోన్ యుమ్నం దర్శకత్వం వహించాడు.

ఉచిత ఆపరేషన్లకు స్పందన

కరీంనగర్‌టౌన్: ఉచితంగా మెదడు, వెన్నెముక ఆపరేషన్‌ల శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ప్రముఖ న్యూరోసర్జన్ డి.రాజశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు చౌరస్తాలోని అఖిరా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి చాలా రకాల ఇబ్బందులతో పేషంట్లు వచ్చారని, 27 మంది పేషంట్లకు ఆపరేషన్లు చేశామని తెలిపారు. ఇందులో డేస్ట్ ఆపరేషన్లు, ఏసైన్ ఫక్షేషన్, సర్వైకల్ సైన్, ఫిబ్రెయిన్ ఆపరేషన్లు చేశామని వెల్లడించారు. 24 మంది పేషెంట్లు డిశ్చార్జ్ అయ్యారని వివరించారు. నిరుపేదల కోసం ఏటా మెదడు, వెన్నెముక ఉచిత ఆపరేషన్లు కొనసాగిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఆస్పత్రి సీఈవో బద్దం దీపక్‌రెడ్డి, చీఫ్ ఇన్‌చార్జి భరత్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడితో ముఖాముఖి


రూధని హర్షిల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

విద్యానగర్: నగరంలోని వావిలాలపల్లి సెయింట్ పాల్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థి, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు రూధని హర్షిల్‌తో శనివారం ఈ పాఠశాల విద్యార్థులకు ముఖాముఖి నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి జాతీయ క్రీడాకారుడిగా ఎదగడం గర్వకారణమన్నారు. రూధని హర్షిల్ తన గురించి విద్యార్థులకు వివరిస్తూ పాఠశాల స్థాయిలోనే విద్యతో పాటు క్రీడలను కూడా సమాంతరంగా నేర్చుకుంటే సమాజంలో మంచి స్థాయిలో స్థిరపడవచ్చని, అందుకు తననే ఉదాహరణగా తీసుకోవచ్చన్నారు. విద్యార్థులకు కబడ్డీ ఆటలోని మెలకువలు నేర్పించగా ప్రిన్సిపాల్ అతడిని శాలువతో సత్కరించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులివ్వాలి

విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులివ్వాలని డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్లు చేర్చడానికి ప్రభుత్వం అవకాశం కల్పించక పోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్యశ్రీ సేవలు అందడం లేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్, ప్రధాన కార్యదర్శి తిరుపతి,నాయకులు రాజు ఉన్నారు.


మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మేయర్ సునీల్‌రావు


మానేరులో మట్టి గణపతులను తయారు చేసిన విద్యార్థులు

మట్టి ప్రతిమలనే పూజిద్దాం

- నగరంలో ర్యాలీలు, మట్టి ప్రతిమల పంపిణీ


ర్యాలీ నిర్వహిస్తున్న అచీవర్స్ విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటు పడాలంటే మట్టి గణపతుల విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించాలని, ఇంట్లో మట్టి గణపతిలనే పూజించాలని కోరుతూ శనివారం నగరంలోని పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు మట్టి గణపతుల ప్రతిమలను తయారు చేశారు. విద్యార్థులు ఇంటి వద్ద సేకరించిన మట్టిని ఒకచోట కూర్చోని తోటి స్నేహితులతో కలిసి రకరకాల గణపతుల ప్రతిమలను అందంగా తీర్చిదిద్దారు. పలువురు విద్యార్థులు మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని ర్యాలీ సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తాలో మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న మట్టి గణపతులను పంపిణీ చేశారు.

మేయర్ క్యాంపు కార్యాలయంలో..

కరీంనగర్‌కల్చరల్: భగత్‌నగర్ మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద 33వ డివిజన్ ప్రజలకు మేయర్ సునీల్‌రావు మట్టి గణపతులు పంపిణీ చేశారు. మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించాలని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతులతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు.

నగునూరు జెడ్పీ పాఠశాలలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలు తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో వాతావరణ, నీటి కాలుష్యమేర్పడుతుందని ప్రధానోపాధ్యాయుడు కట్ట వెంకటేశ్వర్లు తెలిపారు. వినాయక చవితి పండుగ చరిత్రను వివరించారు. ఉపాధ్యాయులు అనసూయ, గోపాలచారి, షమీమ్‌నాజ్ పాల్గొన్నారు.


మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న చకిలం స్వప్న

సెయింట్‌జార్జ్‌లో...

కొత్తపల్లి: కొత్తపల్లి, రేకుర్తి, విద్యానగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు మట్టి వినాయకుల ప్రతిమల తయారీ పోటీలు నిర్వహించారు. సెయింట్ జార్జ్ స్కూల్ చైర్మన్ పి.ఫాతిమారెడ్డి, ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, ఇన్‌చార్జిలు సంగీత, సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సెయింట్‌జార్జ్‌లో..


వింధ్యావాలీ పాఠశాలలో..


నగునూరు జెడ్పీ పాఠశాలలో..

బ్యాంకర్ల గైర్హాజరుపై ఆగ్రహం

- రుణమాఫీ జాబితా అందక గందరగోళం


మొగ్దుంపూర్‌లో మాట్లాడుతున్న టీజీబీ ప్రతినిధి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్, మొగ్దుంపూర్, చామనపల్లి, నగునూరు రైతువేదికల్లో శనివారం రుణమాఫీపై నిర్వహించిన అవగాహన సదస్సులకు బ్యాంకర్లు గైర్హాజరు కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీకి సంబంధించిన జాబితాలు అందుబాటులో లేకపోవడంతో గందరగోళ పరిస్థితులేర్పడ్డాయి. వ్యవసాయాధికారులు రుణమాఫీ సమావేశాలపై సరైన సమాచారం ఇవ్వకపోవడంతో హాజరు కాలేకపోయామని పలువురు రైతులు ఆరోపించారు. చామనపల్లి రైతువేదికలో బహదూర్‌ఖాన్‌పేటకు సంబంధించిన రుణమాఫీ వివరాలను యూనియన్ బ్యాంకు ప్రతినిధి సరిగ్గా చెప్పకపోవడంతో రైతులు వాగ్వాదానికి దిగారు. మొగ్దుంపూర్ రైతువేదికకు యూనియన్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, కరీంనగర్ సింగిల్‌విండో ప్రతినిధులు గైర్హాజరు కావడంతో రైతులు ఆగ్రహించారు. ఇరుకుల్లకు చెందిన కొందరు రైతులు వెళ్లిపోయారు. నగునూరు, దుర్శేడ్ రైతువేదికల్లో రుణమాఫీపై అధికారుల వద్ద సరైన సమాచారం లేకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. రుణమాఫీకి సంబంధించిన సమస్యలను సంబంధిత బ్యాంకర్లు, ఏఈవోలను సంప్రదిస్తే పరిష్కరిస్తారని మండల వ్యవసాయాధికారి సత్యం తెలిపారు. రైతులు ఆందోళనకు గురికావొద్దని అర్హులందరికీ రుణమాఫీ డబ్బులు బ్యాంకుఖాతాల్లో జమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు జక్కం నర్సయ్య, దబ్బెట రమణారెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్‌బీఎస్ కోఆర్డినేటర్ మంద తిరుపతి, జగన్మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం


ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు, అధికారులు

కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే తల్లి, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రిపాలు ఇవ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ, వైద్య శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోప పోషణ వల్ల కలిగే నష్టాలు, రోజు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, మహిళల్లో కలిగే రక్తహీనత తదితర అంశాలపై వివరించారు. 102 రకాల ఆహార పదార్థాలు, మిల్లెట్ ఫుడ్ వంటకాలు ప్రదర్శించారు. 23 మంది చిన్నారులకు అన్నప్రసన చేశారు. మండల వైద్యాధికారి వంశీకృష్ణ, యుఎన్ ఐసీఈఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి, రమేశ్, సతీశ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బదిలీలు, పదోన్నతులు పారదర్శంగా నిర్వహించాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): బదిలీలు, పదోన్నతులు పారదర్శంగా నిర్వహించాలని కోరుతూ శనివారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డిలు మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల అక్రమాలపై పునఃపరిశీలన చేసి న్యాయం చేయాలన్నారు. పదో తరగతి మూల్యాంకనం నిధులు మంజూరైనా ఇప్పటివరకు ఉపాధ్యాయులకు చెల్లించలేదని తెలిపారు.

వినాయక నవరాత్రులకు ఏర్పాట్లు చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: వినాయక నవరాత్రుల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్ సోహన్ సింగ్ కోరారు. శనివారం నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయికి వినతిపత్రం అందచేశారు. 49, 51 డివిజన్‌ల పరిధిలో రోడ్లపై అవసరమైన చోట సీసీ ప్యాచ్‌వర్క్‌లు వేయాలన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సారార్‌లో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు

కరీంనగర్ సిటీ: నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ సేవా పథకం, ఆశాజ్యోతి పాజిటీవ్ పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీ, కరీంనగర్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. 500 మందికి పరీక్షలు చేసి అవగాహన కల్పించారు.

బీసీ సంక్షేమ హాస్టళ్లలో సీట్ల సంఖ్య పెంచాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సీట్ల సంఖ్య పెంచాలని, పెంచిన మెస్ చార్జీలను ఈనెల నుంచే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని కోరారు. ఈమేరకు శనివారం ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బూర వెంకటేశంగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. సంక్షేమ వసతిగృహాలకు, మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. వసతి గృహాల్లో పనిచేసే వర్కర్ల సంఖ్యను 5 నుంచి 10 మందికి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.

'రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్ ఇవ్వాలి'

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీలో ఉద్యోగాలు చేసి రిటైర్డ్ అయి పెన్షన్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తమకు రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష,, కార్యదర్శులు చంద్రయ్య, బచన్‌సింగ్‌లు డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు నారాయణ, బి.రాజయ్య, రాజలింగం, నాగరాజు, అంజయ్య, జలీల్ పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ బార్బర్ డే

విద్యానగర్: కరీంనగర్‌లోని నాయీబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో శనివారం ప్రపంచ క్షౌరవృత్తిదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధన్వంతరిస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయీబ్రాహ్మణ సంఘం జెండా ఆవిష్కరించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎర్రబొజ్జు నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాం, నగర గౌరవ అధ్యక్షుడు ఔదుర్తి లక్ష్మణ్‌కుమార్, అధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్, ఉపాధ్యక్షులు వెంకటేష్, శ్రీనివాస్, బిక్షపతి, రాజయ్య, అందుర్తి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై ప్రచారం


చెర్లభూత్కూర్‌లో ప్రచారంచేస్తున్న వైద్య సిబ్బంది

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్‌లో వ్యాపిస్తున్న డెంగీ వ్యాధిపై ప్రజలను చైతన్యం చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. సిబ్బంది ఆటో ద్వారా గ్రామాల్లో పర్యటిస్తూ డెంగీ వ్యాధిపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. కలెక్టర్ గోపి ఆదేశాల మేరకు శనివారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్, దుర్శేడ్, చెర్లభూత్కూర్ తదితర గ్రామాల్లో ఆటోకు మైక్ ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. ప్రధాన చౌరస్తాల్లో ఆటోను నిలిపి డెంగీ వ్యాధి వ్యాపించే విధానం, దోమల నియంత్రణకు చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు. ప్లాస్టిక్ డబ్బాలో డెంగీ వ్యాధికి కారణమయ్యే దోమలను ప్రత్యక్షంగా చూపిస్తూ చైతన్యపర్చారు. రోజుకు పది గ్రామాల చొప్పున ఆటోలో తిరుగుతూ డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

కరీంనగర్ ఎంపీడీవోగా దివ్యదర్శన్‌రావు


దివ్యదర్శన్‌రావు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నీలగిరి దివ్యదర్శన్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన పవన్‌కుమార్ పదోన్నతిపై జెడ్పీ డెప్యూటీ సీఈవోగా బదిలీ కాగా కార్యాలయ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవో దివ్యదర్శన్ రావును ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో శోభ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు.

పహలా ప్రకాశ్ వేడుకలు

కరీంనగర్‌కల్చరల్: గురుగ్రంథ్ సాహెబ్ తొలిసారి ఉచ్చరించిన రోజును పురస్కరించుకొని శనివారం కరీంనగర్‌లోని గురుద్వారాలో పహలా ప్రకాశ్ వేడుకలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన జత్తా తేరా జత్తా బృందం కీర్తనలు ఆలపించగా వీధుల గుండా నగర కీర్తనలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురుద్వారా ప్రబంధ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సర్దుల్ సింగ్, భిషన్ సింగ్, జగ్‌బీర్‌సింగ్, రణవీర్ సింగ్, సురేందర్ సింగ్, సిక్కు మత గురువులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి తేజదీప్‌రెడ్డి

కరీంనగర్: నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ ఆశయాలకు అనుగుణంగా యువత రాజకీయాల్లోకి రావాలని ఆల్ ఇండియా యూత్‌లీగ్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి తేజదీప్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వాగేశ్వరీ డిగ్రీ కలాశాలలో నిర్వహించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అనుబంధ యువజన సంఘం ఆల్ ఇండియా యూత్ లీగ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుతో పోటీ చేస్తామన్నారు. గెలుపోటములను మా పార్టీ నిర్ణయిస్తుందన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నగర కార్యదర్శి వసీం హైమద్, జిల్లా కమిటీ సభ్యులు కురువెల్లి శంకర్, జి.ప్రశాంత్‌కుమార్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

హోమాలు.. విశేష పూజలు


విశ్వకర్మ భగవానునికి విశేష పూజలు


దర్శించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

- కొనసాగుతున్న విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని కమాన్‌చౌరస్తా గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం విశేష పూజలు జరిపారు. స్థాపిత దేవతారాధనలు, గాయత్రీ విశ్వకర్మ హోమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ హాజరై పూజలు చేశారు. మధ్యాహ్నం టవర్ సర్కిల్‌లో జరిగిన అన్నదానంలో మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్, పట్టణ జువెల్లరీ అసోసియేషన్ అధ్యక్షుడు వంగల శ్రీధర్, ఈవో ఉడుతల వెంకన్న, మాజీ ధర్మకర్తలు శ్రీరామోజు నాగరాజు, వేములవాడ రవీంద్రాచారి, మియాపురం వీరబ్రహ్మాచారి, అనసూరి రమేశ్, ముత్తోజు రాంకుమార్, అర్చకుడు దురిశేటి బ్రహ్మాచారి, జూనియర్ అసిస్టెంట్ గుడికాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడేలా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రాజు

కరీంనగర్‌క్రైం: ప్రతీ నేర సంఘటనలో నిందితులు శిక్షింపబడేలా కోర్టు డ్యూటీ అధికారులు పగడ్బందీ చర్యలు తీసుకోవాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ (పరిపాలన) సి. రాజు అన్నారు. శనివారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శనివారం నిర్వహించిన కోర్టు డ్యూటీ అధికారులు(సీడీవో), సమన్స్-వారెంట్స్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీ కేసులోని దశలను సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడూ తెలియజేస్తూ పటిష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా నిందితులు శిక్షింపబడుతారనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. ఈనెల 12న తల్లిని చంపిన కొడుకు(నిందితుడికి) కేసులో కోర్టు ద్వారా జీవిత ఖైదు శిక్ష విధించబడేలా కృషి చేసిన కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ జాన్‌కి పోలీస్ సీపీ సుబ్బరాయుడు నగదు రివార్డ్ ప్రకటించారని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీ పి.కాశయ్య, సీసీఆర్‌బీ ఎస్సై నరేశ్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బిహార్ హైబ్రిడ్ తాటి చెట్లతో ప్రమాదాల నివారణ


విత్తనాలు నాటుతున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: బిహార్ హైబ్రిడ్ తాటి చెట్లతో గీత కార్మికుల ప్రమాదాలను నివారించవచ్చని ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ అన్నారు. గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తెప్పించిన బీహార్ హైబ్రిడ్ పత్తి విత్తనాలను శనివారం కొత్తపల్లి మండలం ఎలగందుల ఈతవనంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నాటారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, ఎక్సైజ్ ఎస్సైలు స్వప్న, సింధు, ఎంపీటీసీ మంద రమేశ్ గౌడ్, ఉపసర్పంచ్ బోనాల నరేశ్, కార్యదర్శి విజయలక్ష్మి, ఎక్సైజ్ సిబ్బందితో పాటు గౌడ సంఘం అధ్యక్షుడు ఆరె పర్శరాంగౌడ్, గౌడ సంఘం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ పృథ్వీరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.పృథ్వీరెడ్డి, వైద్యాధికారి సల్మా మహీన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మధుమోహన్‌రావు అన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (సైన్స్)లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి ఇంటర్ కీలకమని, యువత మత్తు పదార్థాలు, మద్యం, గుట్కా లాంటి వ్యసనాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. తమ చదువులపై శ్రద్ధ చూపెడుతూ మంచి ఫలితాలు సాధించాలని, ఒకవేళ ఫలితాలు తారుమైనా బాధపడకుండా ప్రయత్నించి విజయం సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రామగిరి కేదారీశ్వర్, జూపాక శ్రీనివాస్, డాక్టర్ బింగి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నేవూరి ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడుతూ భారత దేశానికి ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణకు నిజమైన స్వాతంత్రం రాలేదన్నారు. అప్పటి భారత హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆపరేషన్ పోలో చేపట్టి నిజాం నుంచి తెలంగాణకి విముక్తి కల్పించారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేశ్, కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



కరీంనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని శనివారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 16వ రోజుకు చేరుకున్నాయి. టీపీసీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి



కొత్తపల్లి: విద్యార్థి దశలోనే జీవితానికి గమ్యాన్ని ఏర్పర్చుకోవాలని ఐపీఈ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్) ప్రొఫెసర్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం హెడ్ వై.రామకృష్ణ సూచించారు. కరీంనగర్ సీతా రాంపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'అల్ఫోర్స్ బ్లిగ్‌బాష్' పేరిట శనివారం నిర్వహించిన అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల మేనేజ్‌మెంట్ మీట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందడానికి క్యాట్, మ్యాట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అల్ఫోర్స్ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు గుండా శ్రీనివాస్, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.